తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం | 4 ఆగస్టు 2026
పేజీలు : 08



# ఆరుతాడి పంటలే మేలు

**జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**

- సాగు మార్గదర్శక పుస్తక ఆవిష్కరణ
- వర్షాభావ పరిస్థితుల్లో వరివేసి నష్టపోవద్దు
- చైతన్యంతోనే ఎల్‌నినోను ఎదుర్కొందాం
- గ్రామ మండల స్థాయిలో అవగాహన సదస్సులు





**రంగారెడ్డి, ఆగస్టు 3 (జనంసాక్షి):** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నా య పంటలను ఎంపిక చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగు మార్గదర్శక పుస్తకాన్ని ఆయన వ్యవసాయ అధికారుల తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ సాగు దృష్టి సారించాలని తెలిపారు. అటువంటి లక్ష్యంతో జిల్లా, మండల, గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ వివిధ జిల్లాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన సూచనలు, సలహాలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, సాగు విధానాలు, నీటి వినియోగ సామర్థ్యం, పంటల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పొందుపరుస్తూ ఒక ప్రత్యేక సాగు మార్గదర్శక పుస్తకాన్ని రూపొందించిందన్నారు. రాష్ట్ర నిపుణుల కమిటీ రూపొందించిన ఈ మార్గదర్శక పుస్తకం రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన పెంచుకోనందుకు దోహద పడుతుందని తెలిపారు. మెరుగైన దిగుబడులు సాధించడానికి దోహదపడుతుందని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ మార్గదర్శకాలను రైతులకు విస్తృతంగా చేరవేసి, అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చంద్ర రెడ్డి అదన కలెక్టర్ కిరణ్మయి, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత తదితరులు ఉన్నారు.



# మౌలిక సదుపాయాల కల్పనకే అధిక ప్రాధాన్యత

- మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్
- మున్సిపాలిటీలో రూ.83 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**శంకర్ పల్లి, ఆగస్టు 03(జనం సాక్షి) :** మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం సాధారణ నిధులతో మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో 37.60 లక్షల 15వ వార్డులో 39.50 14వ వార్డులో 5.90లక్షల రూపాయతో అభివృద్ధి పనులను వైస్ చైర్పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి తో కలిసి పనులను ప్రారంభించారు.సందర్భంగా మాట్లాడుతూ..మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతని ఇస్తుందని సాధారణ నిధులతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా, డ్రైనేజీ సమస్యలు తీరుతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో శంకర్పల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ యోగేష్, కౌన్సిలర్లు పైముదాబేగం, ప్రశాంత్,గణేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు చంద్రమౌళి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కో అప్టేట్ సభ్యులు బాలకృష్ణారెడ్డి, మైమూద్, నాయకులు శేఖర్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి,శేరి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సీరియస్



- కొత్త లబ్ధిదారుల ఎంపిక గ్రీన్ సిగ్నల్
- ఇంకా మొదలుపెట్టని ఇండ్లను రద్దు చేయండి
- ఇండ్ల జాబితాలో భారీ మార్పులు
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

8

## పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి

8



## దహన సంస్కారాలకు వెళ్లే దారేది?

- వాగుపై బ్రిడ్జి లేకపోవడం వల్ల ప్రజల ఇక్కట్లు
- వర్షాకాలంలో పాడేతో వాగు దాటడం కష్టం
- వాగుకు బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

లోపలి పేజిలో

**పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం**

- 12వ వార్డులో ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం
- మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి.

# వికారాబాద్‌కు సాగు, తాగునీరు అందించే బాధ్యత నాది

**రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,**



**ధారూర్,ఆగస్టు 3 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.శాఖల వారీగా సమస్యలు,అవసరమైన పనుల వివరాలను అందిస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు.ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రజలు ఫోన్ చేసినప్పుడు తప్పనిసరిగా స్పందించాలని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమ రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు.విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు,అలాగే ప్రతి మండలంలో ఒక పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంతో పాటు గ్రామాల నుంచి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించి,గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని దేశంలో ఎప్పుడో అతివృష్టి,ఎప్పుడో అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నందున నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచించారు.మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్,యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు ప్రారంభించిన పనికి ఆహార పథకాన్ని అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా విస్తరించారని గుర్తు చేశారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం గతంలో వంద శాతం నిధులు ఇచ్చేదని,ప్రస్తుతం మహాత్మా గాంధీ పేరును తొలగించడంతో పాటు నిధుల వాటాను కూడా తగ్గించిందని విమర్శించారు.

వికారాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా ప్రయత్నాలు చేశానని తెలిపారు.గత ప్రభుత్వం పదేళ్లపాటు ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీరు సమీప ప్రాంతాల వరకు వస్తోందని, వికారాబాద్‌కు కూడా నీరు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా ఆయన అంగీకరించారని వికారాబాద్ ప్రాంతానికి సాగు,తాగునీరు అందించే బాధ్యత తనదేనని స్పష్టంచేశారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్,మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి,మండల అభివృద్ధి అధికారి నర్సింలు, తహసీల్దార్ షాజీదా బేగం, వివిధ శాఖల అధికారులు సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా ఎన్నేళ్లకు పూర్తయ్యేనో..?

**2019-20లో పనులు ప్రారంభం 2026 నాటికి పూర్తికాలే**

**కాంట్రాక్టర్ అలసత్వమో..అధికారుల నిర్లక్ష్యమో కానీ గ్రామస్తులకు ఇబ్బందులు**

**అధికారులు చొరవ చూపి స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలంటూ ఉన్న సర్పంచ్ గ్రామస్తులు**

**నవాబ్ పేట్ ఆగస్టు 03(జనం సాక్షి )**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి వైకుంఠ దామాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.ఎనిమిది ఏళ్ల క్రితం ఉపాధి హామీ పథకం,పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నిధులు కేటాయించింది.నవాబ్ పేట్ మండలంలోని గుబ్బడి పత్తేపూర్ గ్రామంలో 2019 – 20 సంవత్సరంలో పనులు ప్రారంభమైన స్మశాన వాటిక నిర్మాణ పలు 2026 సంవత్సరం వచ్చిన పూర్తికాలే.శ్మశాన వాటిక నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఇప్పటి వరకు కట్టిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.దింతో గ్రామస్తులకు శ్మశాన వాటిక అభివృద్ధి కలగ మారింది.

పనులు ఇలా..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో శ్మశాన వాటిక నిర్మాణం కోసం స్టేట్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది.ఈ పనులను ప్రస్తుత బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అప్పటి ఎంపీటీసీ దయాకర్ రెడ్డి దక్కించుకుంది. ఇందులో చేపట్టిన దహన క్రియల ప్లాట్ ఫామ్‌లు, విశ్రాంతి హాల్, స్నానాల గదులు, మరుగుదొడ్లు తదితర నిర్మాణాలు మధ్యాంతరంగా నిలిచిపోయాయి.అసంపూర్తిగా ఉన్న కట్టడాలతో చివరి మజిలీకి వచ్చే ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని పరిస్థితి ఏర్పడింది.శ్మశాన వాటిక ప్రాంతం అసంపూర్తి కట్టడాలు చుట్టు పక్కల ప్రజలకు బహిర్భూమిగా మారిపోయాయి.దహన సంస్కారాల సమయంలో వాటర్ ట్యాంక్ వద్ద బహిరంగ ప్రాంతంలోనే స్నానాలు చేయవలసి రావడంతో మహిళలు చాలా ఇబ్బంది పడవలసి వస్తోంది.పనులు ప్రారంభమై చాలా ఏళ్లు గడిచినా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో



స్మశాన వాటిక పూర్తిస్థాయిలో వినియోగానికి అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణ పనులు తీసుకున్న కాంట్రాక్టర్ లోపమో లేదా అధికారుల నిర్లక్ష్యమో అంత్యక్రియలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారుతోందని గ్రామస్థులు తెలిపారు.కానీ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

**అధికారులు చొరవచూపి తొందరగా పూర్తి చేయాలి : సామెల్ (సాయన్న) సర్పంచ్ గుబ్బడిపత్తేపూర్**



అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనుల వల్ల అంత్యక్రియల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.తమ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న పనులను తొందరగా పూర్తి చేయాలని సర్పంచ్ కోరారు.స్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకువస్తే గ్రామ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

## తెలంగాణ ఆత్మకు ప్రతీక బోనాల వైభోగం

**డాక్టర్ ఏ వి ఆర్ మూర్తి విశ్లేషకులు**



డాక్టర్ ఏ వి ఆర్ మూర్తి

**ఎల్బీనగర్ ఆగస్టు 3 (జనం సాక్షి ) :** ఆషాఢ మాసం రాగానే తెలంగాణ అంతా భక్తి పారవశ్యంతో కళకళలాడుతుంది. గ్రామం నుంచి మహానగరం వరకు అమ్మవారి ఆలయాలు భక్తజన సందోహాలతో నిండిపోతాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, జానపద కళలు, ఆధ్యాత్మికత కలగలిసిన మహోత్సవమే బోనాలు. 'బోనం' అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యం. కొత్త మట్టి లేదా ఇత్తడి పాత్రలో బియ్యం, పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని వేపాకులతో అలంకరించి మహిళలు తలపై మోసుకుంటూ మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఈ పండుగ ప్రధాన విశేషం. ఇది అమ్మవారికి కృతజ్ఞతగా సమర్పించే పవిత్ర కానుకగా భావిస్తారు. బోనాల శోభను మరింత పెంచేది పోతురాజు విన్యాసాలు, శివసత్తుల ఊరేగింపులు, డప్పుల మోతలు, జానపద నృత్యాలు. అమ్మవారి భక్తితో వీధులన్నీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటాయి. ప్రతి ఆలయం విద్యుద్దీపాలతో అలంకరించబడగా, వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకుంటూ దర్శనాలకు తరలివస్తారు. గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచి ప్రారంభమై, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, లాల్‌దర్వాజా మహంకాళి ఆలయం తదితర దేవాలయాల్లో బోనాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. 2014లో తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం బోనాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తించారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయం, జానపద కళల సమ్మేళనంగా నిలిచిన బోనాలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. తరతరాలుగా కొనసాగుతున్న ఈ మహోత్సవం తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతోంది. అని ఈ సందర్భంగా అన్నారు

## దివ్యాంగుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**అందించిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా**



**జవహర్ నగర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** జవహర్ నగర్‌కు చెందిన దివ్యాంగుడు సమ్మయ్య అంత్యక్రియల నిర్వహణకు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా రూ.5 వేల ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సుమారు 15 రోజుల క్రితం సమ్మయ్యను ఓ కారు ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. తొలుత ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తాకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన సమ్మయ్య అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, సమ్మయ్య కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, గతంలో సమ్మయ్య గృహ నిర్మాణానికి కూడా రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా సహాయం చేశారని గుర్తు చేశారు. జవహర్ నగర్ ప్రాంతంలోని దివ్యాంగుల సంక్షేమానికి నిరంతరం సహకరిస్తున్న ఆయనకు తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, చెన్నాపురం రమేష్, పెట్రోల్ బంక్ నరసింహ, అనూక్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవతా కోణం.. ఆకలి తీరుస్తున్న అన్నదానం

**తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో 3వ రోజు విజయవంతం**

**మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి**



**తాండూర్, ఆగస్టు 3 (జనంసాక్షి)** నియోజకవర్గ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, తాండూర్ పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో అగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభమైన 5 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమం సోమవారం విజయవంతంగా మూడో రోజుకు చేరుకుంది.ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు మరియు వారి వెంట వచ్చిన బంధువులకు ప్రతిరోజూ పౌష్టికమైన భోజనం అందజేస్తున్నారు. సోమవారం జరిగిన 3వ రోజు కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి , తాండూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగు , పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరంతా స్వయంగా రోగుల వద్దకు వెళ్లి భోజనాలు వడ్డించి ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని పేద రోగులకు 5 రోజుల పాటు అన్నదానం చేపట్టడం నిజంగా ఆదర్శవంతం. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇది పెద్ద ఉపశమనం కలిగిస్తోంది. మిగతా రెండు రోజులు కూడా అదే సేవా భావంతో కొనసాగిస్తామని అన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి, తాండూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆమె ఆకాంక్షించారు. గత రెండు రోజులుగా నిరంతరాయంగా సాగుతున్న ఈ అన్నదానంలో ఇప్పటివరకు వందలాది మందికి భోజనం అందించారు. ఈ కార్యక్రమం ఆగస్టు 5వ తేదీ వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో బోనాల చెక్కుల పంపిణీ



**మల్కాజిగిరి ఆగస్టు 3(జనంసాక్షి)**

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి, బోనాల పండుగ నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఆనంద్‌బాగ్ లోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య హాజరై ఆలయాల కమిటీ ప్రతినిధులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రజలందరూ హర్షాతిరేకాల మధ్య, వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్,బికె శ్రీనివాస్, గుండా నిరంజన్, ఎస్ఆర్ ప్రసాద్, పిట్టల శ్రీనివాస్,జిడి. సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, కపిల్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, బ్రహ్మయ్య, కన్నె మల్ల నాగరాజు, సుమలత, పుష్పలత, ఆశా, లక్ష్మీ, ఫరీద్, సయ్యద్ మబ్బు, షకీల్, సందీప్ గౌడ్, శంకర్, రామచందర్, పార్థసారథి, వెంకన్న, సిరిగిరీ రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాకాలం ముగిసేదాకా అధికారుల మధ్య సమన్వయం అవసరం




**శేరిలింగంపల్లి, ఆగస్టు 03 (జనంసాక్షి)** : వర్షాకాలంలో ఇటు ప్రభుత్వం, అటు ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోకుండా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగి వర్షాకాలం ముప్పును విజయవంతంగా నివారించాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈ మధ్య కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, తదనుగుణంగా అధికారులు చేపడుతున్న చర్యలను సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ఇస్లావత్ సేవ్యా తోకలిసి ఆయన వాటర్ లాకింగ్ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. మల్కం చెరువు అవుట్లెట్, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా భవనం ప్రాంతం, హెచ్సియు క్యాంపస్ తదితర ప్రాంతాలను ఈ సందర్భంగా జెడ్సి పర్యవేక్షించారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి పట్టణం పరిధిలో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు పుట్టుకొస్తున్న వరదలు, తదనుగుణ సహాయక చర్యలు, ట్రాఫిక్ నిర్వహణవంటి అంశాలపై సర్కిల్ ఉప కమిషనర్ తో, సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాకాలానికి సంబంధించిన అన్ని పనులను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించి అమలు చేయాలని, తక్షణ సమస్యల పరిష్కారంతోపాటు శాశ్వత పరిష్కారాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో సమర్థవంతమైన సమన్వయం, వేగవంతమైన స్పందన మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులుగా వడ్ల సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నిక



**మొయినాబాద్ (జనం సాక్షి )ఆగస్టు03:** ఏఐటీయూసీ మహాసభలు జరిగాయని ఈ మహాసభలలో 250 మంది ప్రతినిధులు హాజరయ్యారని ఈ మహాసభలలో నూతన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు తూచా తప్పకుండా పని చేస్తానని కార్మికుల హక్కుల కోసం, వలస కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తానని నా ఎన్నికకు సహకరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య గ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి మరియు రాష్ట్ర నాయకత్వానికి జిల్లా నాయకత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు

# తల్లి పాలే బిడ్డకు అమృతం

## జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ లాల్



**కుల్కచర్ల, ఆగస్టు 3 (జనం సాక్షి):**మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ లాల్ హాజరై మాట్లాడుతూ.తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి అని తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ ,ఓవరైన కేన్సర్స్ రాకుండా కాపాడుతుందన్నారు.ప్రసవానంతరం గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి మరియు ఆరు నెలల పాటు గర్భం దాల్చకుండా ఉండటానికి సహాయపడుతుంది అని ,తల్లికి బిడ్డకి బంధం బలపడేలా చేస్తుందని చెప్పారు.తల్లి పాలలో అన్ని రకాల పోషకాలు సరియైన మోతాదులో ఉండటం వల్ల బిడ్డకి రోగనిరోధక శక్తి పెరుగుతుంది,మెదడు బాగా అభివృద్ధి చెందుతుందని, న్యుమోనియా వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు సహాయపడుతుంది అని తెలిపారు. ఆరు నెలల వరకి బిడ్డకి డబ్బా పాలు ఇవ్వకుండా కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ కిరణ్ కుమార్,సూపర్వైజర్ యాదమ్మ , ఏఎన్ఎం జంగమ్మ ,మంగమ్మ ,పీఎచ్సీ వైద్యసిబ్బంది, గర్భిణీస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# ఊట్పల్లి బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్కు ఆహ్వానం



**శంషాబాద్,ఆగస్టు3(జనంసాక్షి):**శంషాబాద్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న బోనాల మహోత్సవాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ను శంషాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాచమల్ల సురేష్ ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించి, ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను గ్రామ ప్రజలంతా సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సురేష్ ఎమ్మెల్యేకు వివరించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బోనాల ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తప్పకుండా బోనాల పండుగ ఆహ్వానానికి వస్తానని హామీ ఇచ్చారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10 చలో జైల్ భరోను జయప్రదం చేయండి

## ఆలేటి ఎల్లయ్య




**ఎల్బీనగర్ ఆగస్టు 3 (జనం సాక్షి)**బైరాములగూడ, ఆగస్టు 3: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త చలో జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. బైరాములగూడలో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏదుల గోవిందు, వరిమల్ల అంజయ్య, భూష రాజు, కాశయ్య, కృష్ణమూర్తి, పేర్ల కృష్ణయ్య, కాంతయ్య, ముత్యాలు కృష్ణ, శ్రీను, పందుల ముత్యాలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ పరిశీలన



**కేశంపేట ఆగస్టు 3 (జనం సాక్షి ) :** మండలంలో జరిగే సర్ ప్రక్రియను భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అందె బాబయ్య సోమవారం పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు ఇప్పలపల్లి , దేవుని గుడి తండా, పోమాల్ పల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూర్, తొమ్మిది రేకుల, లింగంధన, నిర్ద వెల్లి, లే మామిడి, భోధునం పల్లి, చింతకుంటపల్లి, వేముల నర్వ గ్రామాలలో బిఎల్ఓ లతో అందె బాబయ్య సమావేశమై సర్ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. అర్హులైన ఓటర్లను నమోదు చేయాలన్నారు. అనర్హుల పేర్లను తొలగించే క్రమంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని బిఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరసింహ యాదవ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల జనరల్ సెక్రెటరీ కల్వకోలు తిరుపతి, మండల ఉపాధ్యక్షులు కంచుకోట నరసింహ, సీనియర్ నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి, కానం ఉదయ్ కుమార్, మున్నూరు యుగంధర్, భక్తవత్సల్ , శివాజీ, కానుగుల మహేష్, ఆకుల గోపాల్, గోపాల్ రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ దేవాలయ కమిటీలకు బోనాల నిధుల చెక్కుల పంపిణీ



**ఎల్బీనగర్ ఆగస్టు 3 (జనం సాక్షి)**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ దేవాలయ కమిటీలకు మంజూరైన బోనాల ఉత్సవాల నిధుల చెక్కులను సోమవారం కర్మన్ఘాట్ హనుమాన్ దేవాలయంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామ్రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి వజీర్ ప్రకాష్ గౌడ్ డివిజన్ అధ్యక్షుమధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పండుగల నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయిస్తోందన్నారు. అనంతరం నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి వజీర్ ప్రకాష్ గౌడ్ డివిజన్ అధ్యక్షులు మాజీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దేవాలయ కమిటీ మాజీ డైరెక్టర్లు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# కాశీలో పట్నం రుక్కమ్మ అంతిమ సంస్కారం

### గంగలో హస్తికలు కలిపిన చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

**తాండూరు అగస్టు 3(జనంసాక్షి) :** మాతృమూర్తి పట్నం రుక్కమ్మ పరమపదించిన నేపథ్యంలో, దశదిన కర్మలు పూర్తయిన అనంతరం అంతిమ సంస్కార కార్యక్రమాలను సోమవారం కుటుంబ సభ్యులు పవిత్ర పుణ్యక్షేత్రం కాశీలో నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కాశీ విశ్వనాథ స్వామి మరియు అన్నపూర్ణేశ్వరి మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగానదిలో హస్తికలు కలిపే పవిత్ర కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాల్లో చీఫ్ విప్ సోదరులు పట్నం నరేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డి, పట్నం ప్రకాష్ రెడ్డి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పుణ్యక్షేత్ర పురోహితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం పూర్తయింది.పట్నం రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు విశ్వనాథుడిని ప్రార్థించారు.

# మర్పల్లి సంతలో కనీస వసతులు నిల్

### వానొస్తే సంత మొత్తం బురదమయమే

### సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

**మర్పల్లి ఆగస్టు 03 (జనంసాక్షి)** మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు అంగడి బజార్, సమస్యల నిలయంగా మారింది. మండలంలోని సుమారు 20 గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఈ సంతకు తరలివస్తున్నప్పటికీ కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వ్యాపారం జరుగుతుందని ఉద్దేశంతో దూర ప్రాంతాలైన జహీరాబాద్, కోహిర్, సదాశివపేట్ తదితర ప్రాంతాల నుండి వ్యాపారస్తులు ఇక్కడ వ్యాపారం చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. వర్షం కురిసిన ప్రతిసారి సంత ప్రాంగణం మొత్తం బురదమయంగా మారుతోంది. దీంతో కూరగాయల అంగడి బజార్అ డుగడుగునా బురద, వర్షపు నీరు పారుతూ ఉండటంతో కొనుగోలుదారులు బురదను



దాటుకుంటూ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులను వర్షపు నీటిలోనే విక్రయించాల్సి రావడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన, మురుగు నీరు, చెత్తాచెదారం కారణంగా వినియోగదారులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు.సంత పరిసరాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతినడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలు రహదారులపై నిలిపివేయడం, ఆటోలు, పండ్ల బండ్లు ఇష్టారాజ్యంగా నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.పాదచారులు ప్రధాన రహదారిపైనే నడవాల్సి వస్తుండటంతో ప్రమాదాల భయం వెంటాడుతోంది. సంత రోజున ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.మర్పల్లి మండల కేంద్రానికి తగిన విధంగా శాశ్వత సంత స్థలాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని, అప్పటివరకు ప్రస్తుత సంతలో తాత్కాలికంగా అయినా బురద నివారణ, పారిశుద్ధ్యం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు అధికారులను కోరుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం

**మర్పల్లి ఆగస్ట్ 03 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శాంతమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలం పరిధిలోని గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల వారీగా పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు సమయానికి హాజరై అవసరమైన వివరాలతో రావాలని ఆమె అన్నారు..



## హనుమాన్ ఆలయానికి స్టీల్ ర్యాంప్ ఏర్పాటు



**ధారూర్ ఆగస్ట్ 03(జనంసాక్షి) :** మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలోని శ్రీ హనుమాన్ ఆలయ నవనిర్మాణ కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులు సులభంగా దేవుని దర్శనం చేసుకునేలా ఆలయ మెట్ల మార్గంలో స్టీల్ ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ ర్యాంప్ ఏర్పాటుకు అవసరమైన రూ.12,000లను గ్రామానికి చెందిన లాల్ మొహమ్మద్ కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ భక్తులు లాల్ మొహమ్మద్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.మత సామరస్యానికి నిదర్శనంగా వారు అందించిన సహకారాన్ని గ్రామస్థులు అభినందించారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ మందిర్ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి,గ్రామ సర్పంచ్ కోలి వెంకటేశ్వర్,మదారి యాదప్ప,దర్జీ రాజు,వడ్ల శ్రీనివాస్, దోమ రమేష్, వగ్గని అంజిలప్ప, రాములు,నర్సింలు,హనుమంతు, షాబుద్దీన్,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ



**కొడంగల్, ఆగస్టు 03( జనం సాక్షి ):**కొడంగల్ మండలం కస్తూర్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్--2లో చిన్నారులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని, తల్లిదండ్రులు కూడా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్,అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.



# చేయని పనులకు బిల్లులు

### పెద్దతుండ సర్పంచ్ అశ్విని, ఉప సర్పంచ్ డి జగదీష్ చర్యలు తీసుకోవాలని డిమాండ్

### ఎంపీడీవో, పంచాయతీరాజ్ శాఖలకు ఫిర్యాదు

**రంగారెడ్డి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** తులేకాలన్ గ్రామంలో అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై చేయని పనులకు బిల్లులు డ్రా చేసుకున్నారని వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయ సూపర్డెంట్ జంగయ్య, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. పనుల్లో నాసిరకం సామగ్రి వినియోగించడం, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలను పాటించడం లేదన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి వేస్తున్న పనుల్లో నాణ్యత లేకపోవడం వల్ల మున్నాళ్లకే యధా స్థానానికి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండానే అర్ధరాత్రి రోడ్లు వేయడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాసిరకం పనులు జరుగుతున్నాయన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి ద్వారా రూ . 1,50,000 నిధులతో 2024 సెప్టెంబర్ 11వ తేదీన పని చేసినట్టు గ్రామంలో బోర్డ్ రాసి ఉందనీ, అక్కడ పని జరగలేదన్నారు. కానీ, చేయని పనులకు చేసినట్టు ఎంబీలు రాసుకుని అధికారులు, కాంట్రాక్టర్ రాము ప్రజా ధనాన్ని కాజేశారని పేర్కొన్నారు. వెంటనే ఇలాంటి పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి, పనుల నాణ్యతను పరిశీలించి, లోపాలు నిర్ధారణ అయిన పక్షంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సామ రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆంజనేయులు, స్కైలాబ్, జనార్ధన్ గౌడ్, సింహాద్రీ రెడ్డి,మహేష్ పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డికి మాతృవియోగం

**తలకొండపల్లి ఆగస్టు03 (జనంసాక్షి):** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,లింగ రావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి కాసు సీతమ్మ ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామమైన రామకృష్ణాపురంలో తుది శ్వాస విడిచారు.ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు,సర్పంచులు,ఆమె మృతదేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.కాసు శ్రీనివాస్ రెడ్డి,ని,కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు.ఈ అంత్యక్రియల్లో సింగల్ విండో చైర్మన్ కేశవ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శి డి.రఘు రాములు,సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు శ్రీశైలం,రఘుపతి,ఆవంచ నరసింహారెడ్డి,రాజేందర్ నాయక్ పాల్గొన్నారు.



# శ్రీ నల్ల పోచమ్మ ఆలయ కమాన్ ప్రారంభం

### ఘనంగా ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



**ఉప్పల్, ఆగస్టు 03 (జనం సాక్షి):**ఉప్పల్ వెంకటేశ్వర కాలనీలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయ నూతన కమాన్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసుల సమక్షంలో మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆలయ కమాన్‌ను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమాన్ దాతలు అన్నపురెడ్డి ఈశ్వర్ రెడ్డి, అన్నపురెడ్డి అన్నపూర్ణ రెడ్డి, విజయ్ కార్తీక్ రెడ్డి, ఈశా రెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, నరసింహ చారి, సల్ల ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్ రెడ్డి, వీరయ్య రవీందర్, వెంకటాచారి, నవీన్ రెడ్డి, సోమయ్య, వెంకటేష్ యాదవ్, ముకుందం, మధుసూదన్ రెడ్డి, నగేష్ యాదవ్, తుమ్మల దేవేందర్ రెడ్డి, కుమ్మరి సత్తయ్య తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 9 జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

### ఎడవెల్లి యాదయ్య మాదిగ



**ముషీరాబాద్, ఆగస్టు 3 (జనం సాక్షి):**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సెప్టెంబర్ 9న వరంగల్ లో నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎడవెల్లి యాదయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ - ఎంఎస్‌పీ మరియు అనుబంధ సంఘాల ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం బాగ్ లింగంపల్లి డివిజన్‌లోని ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ముషీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎడవెల్లి యాదయ్య మాదిగ, కో-ఇంచార్జ్ మునిరాతి రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ, సమావేశం విజయవంతం కోసం డివిజన్, బస్తీ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేసి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో చిలక ఎల్లయ్య మాదిగ, గండి కృష్ణ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ, కుమ్మరి శ్రీనివాస్ మాదిగ, ముచ్చునపల్లి రాములు మాదిగ, తొట్ల గోపి మాదిగ, అమ్మగూడెం దశరథ్ మాదిగ, రోషన్ వినాయకరావు మాదిగ, జేరిపోతుల చంద్రవాస్ మాదిగ, రెడ్డి సంగయ్య మాల, మినప నర్సింగ్‌రావు మాదిగతో పాటు ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నతుండ్ల పేదల స్థలాలకు సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం

### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామీ



**యాచారం, ఆగస్టు 03(జనం సాక్షి )**యాచారం మండలం చిన్నతుండ్ల గ్రామంలోని సర్వే నెం.327లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలకు వారం రోజుల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయిస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు సీపీఎం చిన్నతుండ్ల గ్రామ కమిటీ ప్రతినిధుల బృందం స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించింది. 1983లో 5 ఎకరాల 16 గుంటల భూమిని 121 గజాల చొప్పున కేటాయించగా, 2006లో 60 గజాలకు సవరించి 167 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించినప్పటికీ, ఇప్పటివరకు భౌతికంగా స్థలాలు చూపించకపోవడంతో ఆ పట్టాలు కాగితాలకే పరిమితమయ్యాయని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణలకు గురవుతున్న ఈ భూమిని పరిరక్షించి, అర్హులైన లబ్ధిదారులకు స్థలాలు చూపించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని స్థానిక ఎమ్మార్వోను ఆదేశించారు. త్వరలోనే 167 మంది లబ్ధిదారులకు స్థలాలు అప్పగిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో, సీపీఎం నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి మస్కు మహేందర్, మస్కు విజయ్ కుమార్, సామర్తి జగన్, ఆకుల భిక్షపతి, మస్కు జ్యోతి, మస్కు నరసింహ, బొర్ర భూషణ్, నాగని రవికుమార్, నాగని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# శిశువుకు తల్లిపాలు,ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారం

### ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**రంగారెడ్డి, ఆగస్టు 3 (జనంసాక్షి)**శిశువుకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పోస్టర్లను జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పుట్టినప్పటి నుండి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు కొనసాగించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందించడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుండి రక్షిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం. సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా .జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శాంతి మాట్లాడుతూ.. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలిచ్చే అలవాటును ప్రోత్సహించాలని తెలిపారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సునీల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిడిపిఓలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు బర్క వేదశ్రీ




**షాబాద్, ఆగస్టు 3(జనం సాక్షి);** చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరిచిన విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని గౌతమ్ టైక్వాండో అకాడమీ ఆర్గనైజర్స్, నవజీవన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ పాపిరెడ్డి పేర్కొన్నారు. టైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్ గేమ్స్ లో భాగంగా ఆదివారం వికారాబాద్ లో నిర్వహించిన ఇంటర్ జిల్లా స్థాయి టైక్వాండో ఛాంపియన్షిప్ లో నవజీవన్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి బర్క వేదశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి కి ఎంపికవ్వడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాపిరెడ్డి మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. చదువుపై ఉన్న ఒత్తిడి క్రీడలతో అధిగమిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్విక అండర్ 18 కేజీల విభాగం, భాను అండర్ 20 కేజీల విభాగం, సహస్ర అండర్ 21 కేజీల విభాగం లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం తో స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టైక్వాండో మాస్టర్ వినయ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ప్రశంసలు

### కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్‌కు అండగా ఉంటానని హామీ

**తాండూరు అగస్టు 3(జనంసాక్షి)**మాజీ ఎమ్మెల్యే నారాయణరావు, కంజర్ల



విజయలక్ష్మి యాదవ్ సోమవారం బషీరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశం దాదాపు గంటపాటు కొనసాగింది.ఈ సందర్భంగా కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ప్రశంసలు కురిపించారు. పట్టణం నుండి పల్లెలకు వచ్చి నిరుపేదలకు, మహిళలకు సేవ చేయడం అభినందనీయమని అన్నారు.ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పు తెస్తున్నాయని నారాయణరావు పేర్కొన్నారు. నిరుపేదలకు, మహిళలకు మరింత సేవ చేయాలని సూచించారు.భవిష్యత్తులో కంజర్ల విజయలక్ష్మి చేసే సేవా కార్యక్రమాలకు తాను అండగా నిలుస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజా సేవయే ప్రధాన లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కంజర్ల విజయలక్ష్మి మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతే తమ లక్ష్యమని, మాజీ ఎమ్మెల్యే సూచనలు, సహకారం తమకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.ఈ భేటీతో స్థానికంగా ఫౌండేషన్ కార్యక్రమాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చలో బస్ భవన్ కు ఎంప్లాయీస్ యూనియన్ సంపూర్ణ మద్దతు

### రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

**ముషీరాబాద్, ఆగస్టు 3 (జనం సాక్షి):** ఆగస్టు 4న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టనున్న "చలో బస్ భవన్" కార్యక్రమానికి ఎంప్లాయీస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017 వేతన సవరణ బకాయిలు, 2021 వేతన సవరణ బకాయిలు, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ బకాయిలు, గ్రాట్యుటీ డిఫరెన్స్‌తో పాటు ఇతర పెండింగ్ బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, 2013 నుంచి చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలను కూడా తక్షణమే జమ చేసి, రిటైర్డ్ కార్మికులకు అధిక పెన్షన్ అందేలా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టు 4న నిర్వహించే చలో బస్ భవన్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంప్లాయీస్ యూనియన్ కు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు.



## చేవెళ్లలో ప్రజావాణికి 8 వినతులు.. త్వరితగతిన పరిష్కరించాలి

### ఆర్డీవో పార్థసింహా రెడ్డి

**చేవెళ్ల, ఆగస్టు 03 (జనంసాక్షి);:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేవెళ్ల డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పార్థసింహా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 8 దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 2, పెన్షన్లకు సంబంధించినవి 6 దరఖాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిని త్వరితగతిన పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వినతులపై తీసుకున్న నిర్ణయాలను నేరుగా దరఖాస్తుదారులకు తెలియజేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పార్థసింహా రెడ్డి కోరారు.

## తప్పు చేసిన ప్రతి ఒక్కరికి శిక్ష తప్పదు : ఏసిపి రవికిరణ్ రెడ్డి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 03 (జనంసాక్షి) :** సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, నేరాలు, అసాంఘిక చర్యలు, ప్రజలను భయపెట్టడం వంటి దురాగతాలకు పాల్పడితే తప్పకుండా వారికి చట్టం ప్రకారం శిక్ష తప్పదని ఏసిపి రవికిరణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో అత్యధికంగా జైలుశిక్ష పడిన నిందితులను ఉద్దేశించి ఆయన పై విధంగా వివరించారు. తప్పు చేసినవారు చట్టం నుండి తప్పిచుకోలేరని తెలిపారు. సమర్థవంతమైన దర్యాప్తు, పట్టుదలతో సాక్ష్యాధారాల సేకరణ, మరియు ప్రాసిక్యూషన్ విభాగంతో సన్నిహిత సమన్వయం ద్వారా న్యాయం అందించడంలో మియాపూర్ పోలీసులు గణనీయమైన విజయాన్ని



సాధిస్తున్నారని కొనియాడారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గడిచిన 7 నెలలో హత్య (03) అత్యాచార కేసులు (04) సహా 10 తీవ్రమైన క్రిమినల్ కేసులలో శిక్షలను ఖరారు అయ్యాయన్నారు. దర్యాప్తు అధికారులు చేసిన క్షుణ్ణమైన దర్యాప్తు, గౌరవనీయ న్యాయస్థానాలముందు సాక్ష్యాలను సమర్థవంతంగా సమర్పించడం, మరియు సంధాన అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఈ శిక్షలు ఖరారు చేయబడ్డాయని తెలియజేశారు. ఈ తీర్పులలో హత్య, అత్యాచారం, మహిళలపై నేరాలు మరియు ఇతర తీవ్రమైన నేరాల వంటి వాటిలో దోషులుగా తేలిన నిందితులకు చట్ట ప్రకారం కఠినమైన జైలుశిక్షలు విధించబడ్డాయని అన్నారు. ఘోరమైన నేరాలపై వేగవంతమైన, వృత్తిపరమైన దర్యాప్తును నిర్ధారించడం, సమర్థవంతమైన విచారణ ద్వారా బాధితులకు న్యాయం అందించడంతోపాటు నేర న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడం, ఘోరమైన నేరాలకు పాల్పడిన నేరస్థులను న్యాయస్థానం ముందు నిలబెడతామనే బలమైన సందేశాన్ని పంపడంద్వారా నేర ప్రవృత్తిని ఆశించిన మేర నిరోధించడం, లేనిపక్షంలో నేరానికి తగిన శిక్షలను నిందితులు అనుభవించేలా కార్యాచరణను అమలు చేయడమే నన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలన

**కొడంగల్, ఆగస్టు3 (జనం సాక్షి):** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని మూడవ ,నాలుగు వార్డుల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వైస్ చైర్మన్ శంకర్ నాయక్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను పరిశీలించిన వారు, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాత కొడంగల్ తండాలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విధానం, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు భీమ్లా నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## భావనఋషి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో దీపా యెముల ప్యానెల్ ప్రభంజనం

### అధ్యక్షురాలిగా దీపా యెముల ఘన విజయం.. కీలక పదవులన్నింటిలోనూ ప్యానెల్ అభ్యర్థుల విజయఢంకా

**దమ్మాయిగూడ, ఆగస్టు 3 (జనంసాక్షి):** శ్రీ భావనఋషి వెల్ఫేర్ అసోసియేషన్ (2026--2028) నూతన కార్యవర్గ ఎన్నికల్లో దీపా యెముల ప్యానెల్ ఘన విజయాన్ని నమోదు చేసింది. సభ్యుల నుంచి విశేష మద్దతు లభించడంతో అధ్యక్ష పదవితో పాటు కీలక పదవులన్నింటిలోనూ ప్యానెల్ అభ్యర్థులు విజయం సాధించి సంఘంలో తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఎన్నికల అధికారి ఎం.ఎస్. చారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఈ ఎన్నికల్లో సభ్యులు



భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాల్లో అధ్యక్షురాలిగా దీపా యెముల 287 ఓట్లు సాధించి 97 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా బి. సదానందం 266 ఓట్లతో 65 ఓట్ల మెజారిటీ సాధించగా, ప్రధాన కార్యదర్శిగా బొగ వెంకటేష్ 283 ఓట్లతో 98 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కోశాధికారిగా జయకర్ దర్గా 260 ఓట్లతో 67 ఓట్ల మెజారిటీ సాధించగా, సంయుక్త కార్యదర్శిగా నరసింహులు కోల 254 ఓట్లతో 51 ఓట్ల ఆధిక్యంతో ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎన్. రమాదేవి (248), మేదరి సుభాష్ (240), గండ్ల విజయ్ కుమార్ (270), సందీప్ జడల (261) ఓట్లు సాధించి విజయం సాధించారు. విజయం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. పద్మశాలి టౌన్‌షిప్ సమగ్ర అభివృద్ధికి ప్రతి సభ్యుడి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించిన ఎన్నికల అధికారి ఎం.ఎస్. చారి, ఎన్నికల కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో పాల్గొన్న ప్రతి సభ్యునికి ధన్యవాదాలు తెలియజేస్తూ, సంఘ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**తలకొండపల్లి ఆగస్టు03(జనంసాక్షి):** తలకొండపల్లి మండలానికి చెందిన చుక్కాపూర్ మాజీ ఎంపీటీసీ యాదయ్య గత పది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.స్థానిక వైద్యుల సూచన మేరకు గత నాలుగు రోజుల క్రితం తుక్కుగూడలోని కొండేటి ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు.ఆరోగ్య పరీక్షలు చేసి లివర్ కు స్మాల్ ప్రాబ్లం ఉందని గుర్తించిన వైద్యులు తగిన చికిత్స చేశారు.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం ఆస్పత్రికి చేరుకొని యాదయ్య ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొని,వైద్య బృందంతో మాట్లాడారు.ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని అధైర్య పడుద్దని యాదయ్యకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.పరామర్శించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,చుక్కాపూర్ మాజీ ఉప సర్పంచ్ జక్కు శ్రీనివాస్ రెడ్డి,తుక్కుగూడ రాందాస్,జర్నలిస్ట్ చంద్రకుమార్,నర్సింహులు,శ్రీను తదితరులున్నారు.





## ఎంబిబిఎస్ సీట్లను బిజెపి ప్రభుత్వం అమ్ముకుంటుంది

### వెంటనే నీట్ పరీక్షలను రద్దు చేయాలి

### దక్షిణాది జెయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్

**ఆమనగల్ ఆగస్టు 03 (జనంసాక్షి):** రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని హరిస్తూ,వైద్య విద్యను దక్షిణాది రాష్ట్రాల ఎంబిబిఎస్ సీట్లను కొట్టేస్తున్న ఉత్తరాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుతున్న నీట్,పరీక్షను వెంటనే రద్దు చేయాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ స్పష్టం చేశారు.సోమవారం ఆమనగల్ పట్టణంలో రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్,ఆమనగల్ అంబేద్కర్ సంఘం నాయకులు శంకర్,తో కలిసి ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నీట్ ప్రశ్న పత్రాల లీకేజ్ వల్ల 32 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకముగా మారిన నేపథ్యంలో 21 మంది విద్యార్థులు చనిపోయిన సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమ ఫలితంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం పరిష్కారం కాదని,నీట్ పరీక్ష విధానం రద్దు వల్ల రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కాపాడడమే కాకుండా రాష్ట్రాల వైద్య విద్యను రాష్ట్రాలే రక్షించే విధంగా ఏ రాష్ట్రంలోని ఎంబిబిఎస్ సీట్లను ఆ రాష్ట్రమే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎలాంటి పరీక్ష విధానం లేకుండా ఇంటర్ పరీక్ష ద్వారా ప్రతిభను కనబరిచిన వారికి గతంలో ఇచ్చిన మాదిరిగా సీట్లను కేటాయించాలని ఫలితంగా కోట్లాది రూపాయల కోచింగ్ సెంటర్ల మాఫియా డబ్బులు విద్యార్థుల తల్లిదండ్రులకు మిగులుతాయని కోచింగ్ మాఫియాను అరికట్టడమే పరిష్కారమని అప్పుడే విద్యార్థుల ఆత్మహత్యలు ఆగుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ డివిజన్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జంతుక శంకర్,అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్,అడ్వకేట్ జీవన్ కుమార్,డొక్కా పురుషోత్తం, హఫీజ్, రామచంద్రయ్య, వస్పుల కృష్ణ,జంతుక శివ, మహేష్, యాదగిరి, శ్రీరామ్, అబ్రహం,తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

## రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



**తాండూరు, పరిగి అగస్టు 3(జనంసాక్షి)** అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆర్బిఓఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో వైభవంగా జరిగిన మైసమ్మ--పోచమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఆర్బిఓఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి చేరుకున్న బియ్యని శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.గంగపుత్ర సంఘం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి గౌరవించారు. అనంతరం పోతురాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, భక్తుల హారతుల నడుమ జరిగిన ఊరేగింపులో బియ్యని శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. భక్తులతో కలిసి జాతర సందడిని ఆస్వాదించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోతురాజులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శరీర దృడత్వాని తైక్వాండో క్రీడాకారులు దోహదం

## కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి



**తాండూరు అగస్టు 3(జనంసాక్షి)**శరీర దృడత్వాని తైక్వాండో క్రీడాకారులు దోహదపడతాయని కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం తాండూర్ పట్టణం ఖంజపూర్ సమీపంలో తెలంగాణ రెసిడెన్సియల్ స్కూల్ లో తైక్వాండో శిక్షణ తరగతులను వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మాస్టార్ మనోహర్ చేతులు మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ఫిట్‌నెస్ తో పాటు మానసిక బలం కూడా అవసరం అని ,చాలా మంది క్రీడాకారులు తైక్వాండోను శిక్షణగా తీసుకుంటున్నారని వెల్లడించారు. తైక్వాండో వల్ల శరీరంలో వేగం, చురుకు ద్యానం, బ్యాలెన్స్ పెరుగుతాయని అన్నారు. రిఫ్లెక్స్ లు మెరుగై ప్రత్యర్థి కదలికలను త్వరగా అంచనా వేయవచ్చు అని తెలిపారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని..గాయాలను నివారించడంలో కూడా ఇది సహాయపడు తుంద న్నారు. ప్రతి క్రీడాకారుడు తైక్వాండోను తమ శిక్షణలో భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు తైక్వాండోను నేర్చుకో వాల్సిన అవసరం ఉందని చెప్పారు.కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ రెడ్డి, పిఈటి అఖిల కోచ్ లు కుశల్, ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువుకు తొలి టీకా, తొలి ఆహారం, జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది

## డాక్టర్ స్రవంతి చించోడు వైద్య అధికారి



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** :ఆరోగ్య కేంద్రం చించోడులో డాక్టర్ స్రవంతి గారి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం లో భాగంగా తల్లిపాల యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ప్రతి సంవత్సరము ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహిస్తాము అని, ఈ వారవోత్సవం ముఖ్య ఉద్దేశము తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుందని మరియు ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, మొదటి 6 నెలలు వరకు శిశువుకు తల్లిపాలు తప్పకుండా పట్టించాలి అని చెప్పారు. పాప పుట్టిన వెంటనే వచ్చే మురుపాలు శిశువుకు తొలి. టికా వంటివని, ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తెలియజేశారు. తల్లిపాలు తాగే పిల్లలకు విరేచనాలు, నిమోనియా వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం తక్కువ అని, శిశు వు మెదడు ఎదుగుదలకు, శారీరక మరియు మానసిక అభివృద్ధికి తల్లిపాలు ఎంతో అవసరమని, తల్లి బిడ్డల మధ్య ప్రేమ అనుబంధం మరింత బలపడుతుందని, తల్లిపాలు ఎల్లప్పుడూ పరిశుభ్రమైనవి అని, ఈ పాలు సరైన ఉష్ణోగ్రతలో ఉంటాయని, వీటికి ఎలాంటి ఖర్చు ఉండదని డాక్టర్ స్రవంతి గారు తెలియజేశారు. తల్లి పాపకు పాలు ఇవ్వడం వలన ప్రసవం తర్వాత గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి సహాయపడుతుందని, ప్రసవానంతరశీ రక్తస్రావం తగ్గుతుందని, రొమ్ము క్యాన్సర్లు, అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుందని మరియు తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలియజేశారు. మరియు శిశువు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించాలని, మొదటి ఆరు నెల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి అని, నీరు లేదా ఇతరహారము అవసరము లేదని డాక్టర్ స్రవంతి గారు చెప్పారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భవతులందరూ అంగన్వాడి సెంటర్ లో ఇచ్చే బాలామృతము, గుడ్లు మరియు మురుకులు తప్పకుండా తీసుకొని, తినాలని తెలియజేశారు. వీటివలన తల్లికి , బిడ్డకు కావలసిన పోషకాహారం అందుతుందని చెప్పారు. హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ మాట్లాడుతూ తల్లులందరూ పాప పుట్టిన వెంటనే మరుపాలు తప్పకుండా తాపించాలని, కాన్పు అయిన తర్వాత పిల్లలందరికీ వ్యాధినిరోధక టీకాలు తప్పకుండా ఇప్పించాలని తెలియజేశారు. తరువాత హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భవతులు అందరూ కూడా పోషకాహారము భుజించాలి అని, గర్భవతులు మామూలుగా స్త్రీలు తీసుకునే ఆహారము కంటే ఎక్కువ హారము, ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తీసుకోవాలని, ఎందుకు అనగా తల్లికి మరియు గర్భంలో ఉన్న శిశువుకు శక్తి కావాలంటే ఎక్కువ హారం తీసుకోవాలని చెప్పారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్డు వంటి పోషక ఆహారాలు తీసుకోవాలని, పోషకాహారము తీసుకోవడం వలన కాన్పు సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగవని తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారనిఅయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ సూపర్వైజర్ శ్రీ రమ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడి టీచర్ పుష్ప , ఏఎన్ఎం లు మధువాణి , లలిత , ఆశలు, గర్భవతులు మరియు బాలింత తల్లులు పాల్గొన్నారు

# ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

## చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ డిమాండ్



**ధారూర్ ఆగస్ట్ 03(జనంసాక్షి)** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో కందనెల్లి మానెమ్మ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని గ్రామ ఉప సర్పంచ్ కంది ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయమై ధారూర్ విద్యుత్ శాఖ ఏఈకి పలుమార్లు వినతిపత్రం అందజేసినా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆయన ఆరోపించారు.ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలు,ఆస్తులకు ముప్పు వాటిల్లకముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత విద్యుత్ శాఖ అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ కంది ప్రవీణ్ కుమార్ కోరారు.

# యువత క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి



**ముషీరాబాద్, ఆగస్టు 3 (జనం సాక్షి):**యువత క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణ అన్నారు. ఈ మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పద్మారావునగర్‌లో సాయిరక్ష తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడింగ్ కార్యక్రమంలో 60 మంది విద్యార్థులకు కలర్ బెల్టులు, సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారుల ప్రోత్సాహానికి అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అకాడమీ మాస్టర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఎగ్జామినర్ సంజయ్, సీనియర్ కోచ్‌లు లక్ష్మీనారాయణ, జయేంద్ర, వైష్ణవి, సాకేత్, అమృత, రాయల్ సుకన్య, నిమిత్, పరినిక తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం రూ.116 కోట్ల నిధులు మంజూరు



**యాచారం, ఆగస్టు 03(జనం సాక్షి )** తెలంగాణ ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఉచిత చేపపిల్లలు, రొయ్య పిల్లల పంపిణీ కోసం రూ.116 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మత్స్యకారులకు ఉపాధి మెరుగవడమే కాకుండా, వారి ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని యాచారం మండలం ముదిరాజ్ సంగం కమిటీ అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కానేమోని గణేష్ హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి వారు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసి, అర్హులైన ప్రతి మత్స్యకారుడికి లబ్ధి చేకూరేలా అందరూ సహకరించాలని వారు పిలుపునిచ్చారు.

# దహన సంస్కారాలకు వెళ్లే దారేది

- **వాగుపై బ్రిడ్జి లేకపోవడం వల్ల ప్రజల ఇక్కట్లు**
- **వర్షాకాలంలో పాడేతో వాగు దాటడం కష్టం**
- **వాగుకు బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి**



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 3 (జనం సాక్షి):** దహన సంస్కారాలు చేయడానికి వెళ్లే దారి సరిగ్గా లేకపోవడంతో గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. పెద్దే ముల్ మండలం తింసన్ పల్లి గ్రామ ప్రజలకు దహన సంస్కారాలు చేసుకోవడానికి సరైన దారి లేదు. పల్లె చెల్మె వాగుపై బ్రిడ్జి లేక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ఎవరైనా గ్రామంలో మరణిస్తే వాగులో 10 ఫీట్ల వరకు నీరు ప్రవహించడంతో పాడే పై శవం తీసుకువెళ్లడం కష్టంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా తింసాన్ పల్లి గ్రామం మాత్రం ప్రాథమిక సదుపాయాలకు నోచుకోలేదు. గ్రామానికి ఉన్న ఏకైక వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రైతులు, దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**బతికున్నా చచ్చినా వాగే అడ్డు**

వాగుకు అవతల రైతుల పొలాలు, ఎస్సీ స్మశాన వాటిక ఉన్నాయి. వేసవిలో ఎలాగోలా దాటుతున్నారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి దారుణంగా ఉంటుంది. 8 నుండి 10 అడుగుల లోతు నీరు ప్రవహిస్తుండటంతో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని అలాంటి నీళ్లలోనే మోసుకెళ్లాల్సి వస్తోంది. కన్నీళ్లతో పాటు ప్రాణాలకు తెగించి శవయాత్ర చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని తింసాన్ పల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పొలాలకు వెళ్లడానికి మార్గం లేక చాలా మంది రైతులు వ్యవసాయం చేయలేకపోతున్నారు. ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లలేక, పండిన పంటను తీసుకురాలేక నష్టపోతున్నారు. పొలం కళ్ల ముందు ఉంటుంది కానీ వెళ్లలేం" అని రైతులు ఆవేదన చెందుతున్నారు.దాంతో పాటు స్మశానానికి కూడా దిక్కులేదు.

అందరికీ కడసారి గౌరవం ఉండాలి. కానీ తింసాన్ పల్లిలో చనిపోయినా ఆ గౌరవం లేదు. ఎస్సీ స్మశానానికి వెళ్లే ఏకైక దారి ఈ వాగే. వర్షం వస్తే అంత్యక్రియలకు కూడా వెళ్లలేని పరిస్థితి. పలుమార్లు అధికారులకు, నాయకులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మానవత దృక్పథంతో బ్రిడ్జ్ నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

### బీజేపీ కౌన్సిలర్ నాగారం మల్లేశం ఫిర్యాదు

**తాండూరు అగస్టు 3(జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.సోమవారం ఆయన తాండూరు ఆర్డీవోకు అందజేసిన ఫిర్యాదులో, తాండూరు స్టేషన్ రోడ్డులోని శాంతిమహల్ థియేటర్ ప్రక్కన ఉన్న సర్వే నెంబర్ 135లోని ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ భూమిపై ఎలాంటి హక్కు లేకున్నా అక్రమార్కులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే స్పందించి ఆ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో కూడా ఫిర్యాదు నమోదు చేసినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నాగారం మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని కాపాడటం మన అందరి బాధ్యత. అక్రమార్కుల చేతుల్లోకి ప్రభుత్వ ఆస్తులు వెళ్లకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. 28వ వార్డు ప్రజల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ పోరాడతామని అన్నారు.ఆయన వెంట 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్ కూడా ఉన్నారు.

ఈ ఫిర్యాదు కాపీలను జిల్లా కలెక్టర్, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగానికి కూడా పంపినట్లు నాగారం మల్లేశం తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

## కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన యాదిరెడ్డి కుటుంబ సభ్యులు



**మొయినాబాద్, ఆగస్టు 3, జనంసాక్షి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఢిల్లీలో చెట్టుకు ఉరివేసుకొని అమరుడైన కీర్తిశేషులు మందాడి యాదిరెడ్డి ఇంటికి ఇటీవల కేటీఆర్ వెళ్లారు. ఆ సమయంలో యాదిరెడ్డి సోదరుని కూతురికి గొంతు ఆపరేషన్ అవసరమని తెలుసుకుని, కేటీఆర్ పాపకి శస్త్రచికిత్స చేయించారు. ఈ గొప్ప సహాయానికి కృతజ్ఞతగా.. సోమవారం సబితా ఇంద్రారెడ్డితో కలిసి యాదిరెడ్డి కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు అనంత్ రెడ్డి గారు, మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి,నాయకులు నర్సింహారెడ్డి, మాణిక్ రెడ్డి, కేటీఆర్ ఇంటికి వెళ్లి ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## రైతులకు గిట్టుబాటు ధర,విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి: మార్కెట్ చైర్మన్ గోవిందమ్మ గోపాల్రెడ్డి

**శంకర్ పల్లి,అగస్టు 3(జనంసాక్షి) :** శంకర్పల్లి మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం తోపాటు మార్కెట్‌కు వచ్చే కూరగాయలు, పశువుల అమ్మకాలు, వాటిపై వసూలు చేసే ట్యాక్సులు,పంటల సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటుల ఉండాలన్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సకాలంలో అందించాలని, రైతులు నష్టపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులకు డ్రిప్ పైపులు, పంటలను కప్పడానికి కార్పెట్లు,పందిరి సామాగ్రి, వంటివి అందించాలని కోరారు. వీటన్నింటినీ రాష్ట్ర కార్యాలయ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని సభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, ఏవో చైతన్య, సెక్రటరీ ఐశ్వర్య లక్ష్మి, ఏఈవోలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## తల్లిపాల వలన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**బొంరాస్ పేట, ఆగస్టు 3 (జనం సాక్షి):** తల్లిపాల వలన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శిశువుకు రోగనిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు తప్పక పట్టించాలని, డబ్బ పాలు పట్టించడం వల్ల శిశువు ఎదుగుదల లోపంతో పాటు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ అక్షయ్ అన్నారు. సోమవారం ఏర్పుమల్ల మండల అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ గౌసియా బేగం, ఏఎన్ఎం పుష్పలత, ఆశ వర్కర్లు అనురాధ, నర్సమ్మ, జగదాంబ, సరోజ, ఆయా చంద్రమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

**తాండూరు అగస్టు 3(జనంసాక్షి) :** పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డిపేర్కొన్నారు.ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతతో పాటు అన్ని వయసుల వారు వ్యాయామం చేసేలా ఓపెన్ జిమ్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సీరియస్



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 3 (జనం సాక్షి):** జిల్లా లో మొదటి విడత లో మంజూరై ఇంకా మొదలు పెట్టని ఇందిరమ్మఇండ్లకు మరియొక సారి క్షేత్ర స్థాయి లో పరిశీలించి రద్దు చేస్తూ కొత్త ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నందు అన్ని మండలాల ఎంపిడిఓలు సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి ఇంకా మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్లకు కొత్త ప్రతిపాదనలు ఇందిరమ్మ కమిటి ద్వారపంపించాలన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించిన కొత్త ప్రతి పాదనలు కమిటి ద్వార తీసుకొని పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో గుడిసెలు ఉన్న వాటిని గుర్తించి ఈ నెల 15 వరకు ప్రతి పాదనలు పంపించాలన్నారు. రూఫ్ రిప్లేస్మెంట్ ను ఈ నెల చివరి వరకు ప్రతిపాదిస్తూ నివేదికలు పంపించాలన్నారు. కోడంగల్ నియోజకవర్గం కు సంబంధించి ఎల్ 1 లిస్టు పరిశీలించి పంపించాలని ఆదేశించారు.

పంచాయతి రాజ్ నుండి వి ఓ బిల్డింగ్,ప్రతి ఇంటికి ఐ ఎచ్ ఎస్ ఉండాలని ,ఆదేశించారు. మండలం వారిగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఫిట్టింగ్, ప్లాంటేషన్ ఐ హెచ్ ఎస్ డాక్యుమెంటేషన్ పనులు చేపట్టాలని అన్నారు.గ్రామాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే, చేపట్టిన ప్రతి పనికి సంబంధించిన వివరాలను ఐ హెచ్ ఎస్ డాక్యుమెంటేషన్‌లో పూర్తిస్థాయిలో నమోదు చేయాలని, అవసరమైన ఫోటోలు, జియో–ట్యాగింగ్ మరియు సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, పి డి హౌసింగ్ ముక్రం బాబా, డి ఆర్ డి ఏ శ్రీనివాస్ , డి పి ఓ జయసుధ,సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బాధితుల రిలీఫ్ ఫండ్‌ను వెంటనే విడుదల చేయాలి

### దళిత బహుజన శ్రామిక యూనియన్ డిమాండ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 03(జనం సాక్షి ):** రంగారెడ్డి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం కింద బాధితులకు అందవలసిన రిలీఫ్ ఫండ్ (పరిహార నిధులు) గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉండటంపై దళిత బహుజన శ్రామిక యూనియన్ మరియు ఇతర సామాజిక సంస్థల ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. చట్టప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయిన వారం రోజుల్లోగా మొదటి విడత పరిహారాన్ని, పోలీసులు కోర్టులో చార్జిషీట్ వేసిన తర్వాత రెండవ విడత నిధులను బాధితుల అకౌంట్లలో జమ చేయాల్సి ఉంటుందని ప్రతినిధులు గుర్తుచేశారు. కానీ జిల్లాలో నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా మంచాలలో 22, యాచారంలో 13, ఇబ్రహీంపట్నంలో 11, తలకొండపల్లిలో 10, కందుకూరులో 8, మాడుగులలో 6, ఆమనగల్‌లో 5 కేసులు చొప్పున రిలీఫ్ ఫండ్ కోసం పెండింగ్‌లో ఉన్నాయని వారు వివరించారు. కలెక్టర్ వెంటనే స్పందించి, జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ నిధులను తక్షణమే ఆన్‌లైన్ ద్వారా బాధితుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీవీఎంసీ జిల్లా కన్వీనర్ బోడ కృష్ణ, డి బి ఎస్ యూ ఇబ్రహీంపట్నం డివిజన్ సెక్రెటరీ బడే కుమార్, పార జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ బడే భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.